క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

కొల్లాపూర్: వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై అందించే జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ నాగరాజు వెల్లడించారు. 65 శాతం రాయితీపై జీలుగ విత్తనాలు అందిస్తున్నట్లు వివరించారు. 30 కిలోల బస్తా సబ్సిడీపై రూ.843కు అందిస్తున్నట్లు చెప్పారు. జీలుగ విత్తనాలను పచ్చిరొట్ట ఎరువుగా మార్చి పొలాలకు వినియోగించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ పత్రాలు వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించి తీసుకెళ్లాలని సూచించారు.

పోస్టర్ విడుదల

తెలకపల్లి: గిరిజన అలాయ్ బలాయ్ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు రెడ్డపాకుల శివశంకర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని బోరబండ, శివరాంపల్లి తండాల్లో వారు పర్యటించి అలాయి బలాయ్ ప్రచారం నిర్వహించారు. 31న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరగబోయే గిరిజన అలాయ్ బలాయ్ కార్యక్రమానికి గిరిజన తండాల నుంచి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం అలాయ్ బలాయ్ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. శివశంకర్‌తో పాటు బీఎస్పీ మండల నాయకులు మోగులాల్, రాజేశ్, భాస్కర్, సాయిలు, శ్రీకాంత్, మల్లేష్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ

పెంట్లవెల్లి: మండలంలోని పలు రైస్ మిల్లులను స్థానిక తహసీల్దార్ దామోదర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పై అధికారుల ఆదేశాల మేరకు రైస్‌మిల్లులను, కొనుగోలు కేంద్రాల్లో తనిఖీ చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని భద్రపరుస్తున్నారా లేదా, వాటి యొక్క తరువులు ఎంత, రైతులకు డబ్బులు అందుతాయా లేదా అని పరిశీలించామని చెప్పారు. ఎటువంటి అవకతవకలు లేకుండా కొనుగోలు చేయాలని ఐకేపీ వారికి మిల్లర్లకు తెలియజేశారు.

విద్యార్థులకు సన్మానం

కందనూలు: జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో రిలయన్స్ ట్రెండ్స్ ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను మేనేజ్‌మెంట్ బుధవారం సన్మానించి, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా స్టోర్ మేనేజర్ మాట్లాడారు. విద్యార్థులందరూ ఇదే స్ఫూర్తితో చదివి, ఉన్నత విద్యలో కూడా టాప్ ర్యాంకు సాధించాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు

తాడూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే గర్భిణులు కాన్పులు నిర్వహించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సంతోష్ అభిరాం కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో యత్మతాపూర్‌కి చెందిన హైమావతికి కాన్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో పనిచేసే ఆశా వర్కర్లందరూ ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు నిర్వహించుకుంటే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వర్తిస్తాయనే విషయమై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లక్ష్మీకుమారీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చెంచుపెంటల్లో వైద్యశిబిరాలు

అమ్రాబాద్: పదర మండలం పెట్రాల్‌చేన్, పల్లెరూట్ పెంటల్లో బుధవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మొత్తం 97 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య సూత్రాలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డివిజన్ ఉప మలేరియా అధికారి అశోక్ ప్రసాద్, వైద్యాధికారులు దీపక్ రాయ్, రాజీవ్, ఎల్‌ఎల్‌హెచ్‌ఓ స్వప్న, ఎంపీహెచ్‌ఈఓ బిక్కులాల్ పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి

వెల్దండ: మండల పరిధిలోని అల్లంతోటబావి తండాలో హనుమాన్ దేవాలయం, ముత్యాలమ్మ దేవాలయాలకు తనవంతు సహకారం అందిస్తామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అల్లంతోటబావితండాలో ఆయన పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఫౌండేషన్ ద్వారా ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. రాజు, గంగ్యనాయక్, గోపాల్, ఫుల్‌సింగ్, అరుణ్, పుణ్యానాయక్, శ్రీను తదితరులు ఉన్నారు.

పాలమూరు- రంగారెడ్డి పనుల పరిశీలన

కోడేరు: మండలంలోని తీగలపల్లిలో కొనసాగుతున్న పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు సాగర్, భూపాల్, ధర్మనాయక్, దేశ్యానాయక్, నర్సింహులు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పనులు నాణ్యతగా ఉండాలని సూచించారు. అనంతరం పంపుహౌస్ పనుల తీరును డీఈ సత్యనారాయణగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు.



నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



పెద్దకొత్తపల్లిలో మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

చారకొండ: విత్తన సీడ్ దుకాణాల్లో విత్తన డీలర్లు, రైతులకు నకిలీ విత్తనాలను విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చారకొండ వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్, ఎస్‌ఐ కల్యాన్ రావు హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం విత్తన సీడ్ షాపులను తనిఖీ చేసి షాపులో నిల్వ ఉన్న సీడ్ పాకెట్లు, వాటి లేబుల్, వ్యాలిడిటి తదితర వాటిని పరిశీలించారు.

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల పరిధిలోని విత్తన దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మరాదని, మండలంలో కూడా ఒక నకిలీ విత్తనం కన్పించవద్దని ఏఓ కమల్‌కుమార్ సూచించారు. బుధవారం తిమ్మాజీపేట మండల కేంద్రంలోని వ్యవసాయ దుకాణాల్లో ఎస్‌ఐ షేక్ శంషోద్దీన్, ఏఓ కమల్‌కుమార్ కలిసి విత్తన దుకాణాలు, ఫర్టిలైజర్ దుకాణాలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను బుధవారం వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఏఓ శ్రీలత, ఎస్‌ఐ రమేశ్ హెచ్చరించారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎరువుల



తిమ్మాజిపేటలో తనిఖీ చేస్తున్న అధికారులు

దుకాణాలను తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ రమేశ్, ఎస్‌ఐ రాములు, బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మితే దుకాణాలపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువుల దుకాణాల యజమానులు షాపుల్లో స్టాక్ పాయింట్ బోర్డులు, ధరల పట్టికలను నమోదు చేయాలని సూచించారు. రైతులు క్రిమిసంహారక మందులు, ఎరువులు, కొనుగోలు చేసినప్పుడు దుకాణ యజమానులతో రశీదులు తప్పకుండా పొందాలని సూచించారు. ఎరువుల దుకాణాల లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు ఆధార్‌కార్డుతో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలిసి ఏఓ సాయిరమేశ్ బుధవారం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం న్యూగణేష్ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లోని పత్తి విత్తనాలు, ఇన్వాయిస్ ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు, స్టాక్ రిజిస్టర్లు, నకిలీ విత్తనాలు వంటి వాటిని పరిశీలించారు. బీటీ-3 విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించకుంటే..

అమ్రాబాద్: ఫర్టిలైజర్ దుకాణాల నిర్వహణలో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రం అమ్రాబాద్‌లోని ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు, మందులు అమ్మకూడదని దుకాణాల వద్ద ధరల పట్టిక పాటించాలని సూచించారు. స్టాక్‌రిజిస్టర్లు, బిల్‌బుక్‌లు పదిహేను రోజులకు ఒకసారి పరిశీలిస్తానమని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కోడేరు: గ్రామాల అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాచుపల్లిలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాచుపల్లి నుంచి ఏదుల వరకు బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయని, పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. నర్సాయిపల్లి నుంచి చెన్నారం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.30 కోట్ల నిధులతో టెండర్ పూర్తయిందని తెలిపారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. వరి ధాన్యం నిల్వ ఉండటంతో వెంటనే సంబంధిత శాఖ అధికారులతో రైతుల వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. అనంతరం సింగాయిపల్లిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్త ఎంతో కృషి చేయాలని, రాబోయే రోజుల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌గౌడ్, పూర్ణచంద్రారెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నల్లమలను సస్యశ్యామలం చేస్తా..



బాణాలలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

బల్మూర్: రాజకీయ జన్మనిచ్చిన నల్లమల ప్రాంతమైన అచ్చంపేట నియోజకవర్గాన్ని సాగునీటితో సస్యశ్యామలం చేసి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని బాణాలలో దేవాలయాన్ని సందర్శించిన ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నియోజకవర్గంలో ఉమామహేశ్వర, చెన్నకేశవ, ఆంజనేయ ప్రాజెక్టుల నిర్మాణాలకు రూ.2,500 కోట్లు ప్రభుత్వ మంజూరు చేసిందన్నారు. త్వరలోనే శంకుస్థాపనలు చేస్తామన్నారు. సర్పంచ్ పద్మ, గోపాల్‌నాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి ప్రత్యేక కృషి

మన్ననూర్: తెలంగాణ ప్రభుత్వం దళితుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అన్నారు. బుధవారం ప్రశాంతి నగర్‌లో రైతులకు ఎస్సీ కార్పొరేషన్ మొదటి విడత పైలెట్ ప్రాజెక్టుగా మంజూరు చేసిన బోర్లను ఎమ్మెల్యే లాంఛనంగా డ్రిల్లింగ్ చేసి ప్రారంభించారు. అంతకు ముందు గ్రామంలో లబ్ధిదారులు, గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 70 ఏళ్లుగా పాతుకుపోయిన సమస్యలను సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని అన్నారు. సర్పంచ్‌లు శ్రీరాంనాయక్, శారద, పెద్దిరాజ్, రాంబాబు, రాంలాల్, రాజేందర్‌రెడ్డి, రామ్మోహన్, శ్రీధర్‌రావ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

‘చివరి ఆయకట్టు వరకు నీరు’



సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తి: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా చివరి ఆయకట్టు నా జిల్లా వరకు రైతులకు సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కేఎల్‌ఐ డి-82ను పూర్తి చేసి సాగునీరు అందించాలన్నారు. నియోజకవర్గంలో అంబరాయ చెరువుకు రూ.76 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే చెప్పారు. వెల్దండ, కల్వకుర్తి పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు రూ.15 కోట్లు విడుదల చేయాలని ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణను కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, శ్రీకాంత్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

కల్వకుర్తి టౌన్: పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ సత్యంతో కలిసి ప్రారంభించారు. పట్టణం వెంట త్వరలోనే జాతీయ రహదారి వెళ్తుందని, అందులో భాగంగా పట్టణం మరింతగా అభివృద్ధి చెందుతుందని గుర్తు చేశారు. పట్టణంలోని తిలక్‌నగర్, గాంధీనగర్, సంజాపూర్ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులతో పాటుగా, నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభిచారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కమిషనర్ అశ్రిత్ కుమార్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తాం..

అచ్చంపేట రూరల్: నిషేధిత నల్లబెల్లం అమ్మినా, సారా కాచి తరుచూ పట్టుబడే వ్యక్తులపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని అచ్చంపేట ఎక్సైజ్ ఎస్‌ఐ బాలరాజు, సతీష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పులిజాల సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. బైక్‌పై 15 లీటర్ల సారా తరలిస్తున్న వ్యక్తిని ఆపగా బైక్‌ను వదిలి పరారయ్యాడు. సారాను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది నవీన్, ఉషారాణి పాల్గొన్నారు.

మహిళలపై కేసు నమోదు

తెలకపల్లి: సారా రవాణా చేసి విక్రయించేందుకు తీసుకొచ్చిన ఇద్దరు మహిళలపై ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐ, ఎస్‌ఐ జనార్దన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఎక్సైజ్ అధికారులు రూట్ వాచ్ చేస్తుండగా.. ఇద్దరు మహిళలు సారతో పట్టుబడ్డారు. యాపట్లకు చెందిన రూప్లీ, అవుసలికుంట నుంచి అంబటిపల్లి వెళ్తున్న లింగాల ఆర్టీసీ బస్సులో సారాతో ప్రయాణిస్తుండగా.. మహిళ వద్ద సారా ఉందని గుర్తించి ఆమెను పట్టుకున్నారు. ఆమె వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ వాహనంలో ఎక్కించుకుని లింగాలకు వెళ్లారు. అదే బస్సులో మరో మహిళ తన 4 సంవత్సరాల కుమార్తెతో లింగాలలో బస్సు దిగింది. ఆమె మారెడుదిన్నెకు చెందిన చిట్టిగా గుర్తించారు. గతంలో ఆమెపై 3 కేసులు ఉన్నాయని తెలిపారు. ఎక్సైజ్ అధికారులను చూసి లింగాలలో బస్సు దిగి పాపను సారా బాటిళ్లను వదిలి పారిపోయింది. ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఆమె విడిచిపెట్టిన సారా బాటిళ్లు, చిన్నారిని ఎక్సైజ్ అధికారులు తెలకపల్లి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. లింగాల జెడ్పీటీసీ చంద్రయ్య, ఎంపీటీసీ మల్లేష్ ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చి, ఆ పాపను మేము కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని చెప్పడంతో వారికి పాపను అప్పగించారు.

సారా పట్టివేత..

బల్మూర్: మండలంలోని కొండనాగుల పంచాయతీ చౌటతండాలో బుధవారం రాత్రి ఆరు లీటర్ల సారాను పట్టుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. చౌటతండాకు చెందిన ఆంగోత్ భాస్కర్ సారాను విక్రయిస్తున్నాడనే సమాచారంతో కాపుకాసి పట్టుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

గాలివాన బీభత్సం



ధ్వంసమైన పౌల్ట్రీ ఫాం షెడ్

చారకొండ: గాలి, వాన మంగళవారం రాత్రి బీభత్సం సృష్టించింది. మండలంలోని సిర్సనగండ్లలో ఈదురుగాలులతో కూడిన వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. సిర్సనగండ్లకి చెందిన ఈర్లపల్లి విష్ణు, ఎల్లమ్మలు ఇటీవల దళిత బంధులో పౌల్ట్రీ ఫాం యూనిట్‌ను ఎంచుకుని యూనిట్‌కు అదనంగా రూ.5 లక్షల పెట్టుబడి పెట్టి, వారి వ్యవసాయ పొలంలో నిర్మాణం చేపట్టారు. మంగళవారం గాలి వాన బీభత్సవంతో పౌల్ట్రీ ఫాం షెడ్లు పైకప్పు పూర్తిగా ధ్వంసమై భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన షెడ్లను సర్పంచ్ శారద శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. షెడ్ ధ్వంసమై నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఇంటి పైరేకులు ధ్వంసం

వెల్దండ: మండల పరిధిలోని బొల్లంపల్లిలో మంగళవారం రాత్రి వీచిన గాలికి గ్రామానికి చెందిన సొప్పటి బాలస్వామి ఇంటి పైకప్పు సిమెంట్ రేకులు ధ్వంసమయ్యాయి. ప్రభుత్వ పరంగా కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు.

పందులను ఇతర ప్రాంతాలకు తరలించండి

కందనూలు: పట్టణంలోని పందులను జనావాసాల నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలని మున్సిపల్ కమిషనర్ జయంత్ కుమార్‌రెడ్డి పందుల యాజమానులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పందుల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పట్టణంలోని వీధుల్లో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, వాటితో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పందులను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. లేకుంటే మున్సిపల్ కార్యాలయం నుంచి పందులను పట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో పురపాలక సిబ్బంది తదితరులు ఉన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వంశీకృష్ణ

వెల్దండ: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పేదలకు, రైతులకు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో న్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం వెల్దండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సీల్పీ నేత భట్టి విక్రమార్క ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్రలో భాగంగా 25న జడ్చర్ల పట్టణంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, బలరాంగౌడ్, తిరుపతిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి



కొరటికల్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రీధర్

తాడూరు: వరిధాన్యాన్ని మిల్లర్ల వద్దకు తీసుకొచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ కార్తీక్ రైస్ మిల్లర్ల యజమానులకు సూచించారు. బుధవారం మండలంలోని ఇంద్రకల్, తాడూరు రైస్ మిల్లుల వద్ద వరి ధాన్యంతో ఆగిన వాహనాలను పరిశీలించి రైస్ మిల్లర్ల యజమానులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని రైస్ మిల్లుల్లో సాంకేతిక సమస్య ఉన్నందున వాహనాలు కొంతమేర ఆగాయని, సమస్య పరిష్కరించి ఆగిన వాహనాలన్నింటిని రేపటి లోగా సరిచేస్తామని మిల్లు యజమాని సుధాకర్‌రావు వివరించారు. ఆయన వెంట ఆర్‌ఐ గోపాలకృష్ణ ఉన్నారు.

తూకాల్లో ఇబ్బందులు పెడితే చర్యలు

ఉప్పునుంతల: మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో కటింగ్‌లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీధర్ మండల ప్రత్యేకాధికారి హోదాలో హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఉప్పునుంతల, కాంసానిపల్లి, కొరటికల్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రికార్డులను, ధాన్యం నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు తీరుపై పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం అమ్మడానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ శైలేంద్ర కుమార్, ఎమ్మార్వై రాజేశ్వర్‌రెడ్డి, సీఈఓ రవీందర్ రావు, ఏఈఓ మంజుల పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు

ఊర్కొండ: జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మాదారం సర్పంచ్, ద్యాప నిఖిల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి భారీగా చేరుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. ర్యాలీగా వెళ్లి కేక్ కట్ చేశారు. ద్యాప నిఖిల్ రెడ్డి, విజయుడు, అయూబ్ పాషా, మనోహర్ రెడ్డి ఆది నారాయణ, జగదీశ్వర్, తిరుపతయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్లు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవికి వినతి అందజేశారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులకు సంబంధిత ఏజెన్సీ గుత్తేదారు సకాలంలో వేతనాలు అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు 10 నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ పీఎఫ్, ఈఎస్‌ఐ కూడా ఏజెన్సీ నిర్వాహకులకు చెల్లిస్తున్నారో లేదో తెలియని దుస్థితి నెలకొందని ధ్వజమెత్తారు. మారేడు శివశంకర్, అన్నపూర్ణ, రేణుక, శ్వేత, అరుణ, రాణి, సుజాత, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీపై గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌రావు

ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లిలో బుధవారం రెండో విడత గొర్రెల పంపిణీపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు మాట్లాడారు. మొదటి విడతలో గొర్రెలను పొందిన లబ్ధిదారులను మినహాయించి మిగతా వారికి రెండో విడతలో గొర్రెలను పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారులు ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను పశువైద్యాధికారికి సమర్పించాలని చెప్పారు. అదేవిధంగా లబ్ధిదారుని వాటాగా చెల్లించాల్సిన రూ.43,750లను సమకూర్చుకుని పెట్టుకోవాలన్నారు. గ్రామ సభలో పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, పశువైద్యాధికారి నరేందర్, ఎంపీటీసీ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి, యాదవ సంఘం నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

చారకొండ: దేశంలో ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రభుత్వమే ఉచితంగా అందించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావుకు వినతి అందించారు. ప్రతి ఒక్కరికి రాజ్యాంగ గ్రంథం అందించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్, మల్లేష్, రవికిరణ్, సురేష్, రమేష్, శంకర్, రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.


కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

వెల్దండ: వెల్దండ మండల పరిధిలోని పల్గుతండా, శంకర్‌కొండతండా, రాఘయపల్లి గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులు జాతీయ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పనులకు వెళ్తున్న కూలీలు వేసవిలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే గిట్టుబాటు కూలి లభిస్తుందన్నారు. ఉపాధిహామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు, ఫీల్డ్‌అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఓ ఈశ్వర్, ఈసీ దేవేందర్‌గౌడ్, టీఏ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదాం..



ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

అచ్చంపేట రూరల్: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ పాటుపడాలని అచ్చంపేట మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ కోరారు. బుధవారం పట్టణంలోని డీఆర్‌సీ సెంటర్‌లో మేర లైఫ్ మేర స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు తమ ఇళ్లలోని పాడి చెత్త అనగా ప్లాస్టిక్ బాటిళ్లు, పాత దుస్తులు, చెప్పులు, బుక్కులు లాంటివి సెంటర్ వద్ద ఇచ్చి రీసైక్లిన్ చేసేందుకు సహకరించాలని కోరారు. ప్రవీణ్‌కుమార్, తిర్పతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

వెల్దండ: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తుందని ఎంపీపీ విజయ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బైరాపూర్-కుందారం తండా మధ్య నూతనంగా బీటీరోడ్డు నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. సీఎం కేసీఆర్ తండాలు, గ్రామాలు అభివృద్ధి చేసేలా అనేక పథకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి, వాటికి రోడ్డు సౌకర్యం కల్పించడానికి బీటీరోడ్లును నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయసుధ

చారకొండ: హరితహారంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ జయసుధ సూచించారు. మండలంలోని తిమ్మాయిపల్లి, గోకారం, చంద్రాయనపల్లి, శేరిఅప్పారెడ్డిపల్లి, అగ్రహారం తండాలో నర్సరీలో మొక్కలు పరిశీలించి, ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీకి ఇచ్చిన టార్గెట్ ప్రకారం మొక్కలను సిద్ధం చేయాలని చెప్పారు. నర్సరీల నిర్వహణలో గ్రామాల్లో పనితీరుపై సర్పంచ్‌లను, కార్యదర్శులను అభినందించారు. నిర్లక్ష్యం వహించకుండా మరింత శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై కార్యదర్శులతో మాట్లాడారు. వారి వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

రోగులకు వైద్యసేవలు

కల్వకుర్తి రూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని మండల పరిషత్ అధ్యక్షురాలు మనోహరా చెన్నకేశవులు కోరారు. బుధవారం మండలంలోని తోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆస్పత్రికి వచ్చే రోగులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రుల్లో ప్రతి నెల జన ఆరోగ్య సమితి సమావేశం ఏర్పాటు చేయాలని కోరడంతో పాటు ఆస్పత్రి అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేశారు. ఎంపీడీఓ ఆంజనేయులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమానాయక్, వైద్యులు శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొండివైఖరి వీడాలి

తెలకపల్లి: వీఓఏలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని సీఐటీయూ జిల్లా నాయకులు గోపస్ లక్ష్మణ్ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారానికి 38వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మద్దతు తెలియజేశారు.

తాడూరు: సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీఓఏలకు మద్దతుగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న పాల్గొని మాట్లాడారు.

బల్మూర్: భారత రాజ్యాంగ గ్రంథం పుస్తకాలను ప్రతిఒక్కరికీ అందించాలని డిమాండ్ చేస్తు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.